క్లుప్తంగా

రేపు కంటి వైద్య శిబిరం

సదాశివపేట(సంగారెడ్డి): ప్రభుత్వ రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఈ నెల 8వ తేది పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం పట్టణ అధ్యక్షుడు బోడగామ శంకరప్ప శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ మండల పరిధిలోని ప్రభుత్వ రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు హైదరాబాద్ మెడివిజన్ కంటి అస్పత్రి వారిచే కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కంటి అపరేషన్ అవసరమున్న వారికి ప్రత్యేక వాహనంలో హైదరాబాద్ తీసుకెళ్లి అపరేషన్ చేయించి అదే వాహనంలో క్షేమంగా తీసుకు వస్తామన్నారు. ఈ అవకాశాన్ని రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు సద్వినియోగించుకోవాలని సూచించారు.

సైబర్ నేరాలపై అవగాహన



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని బుదేరా పోలీస్‌స్టేషన్‌లో ఆయా గ్రామాలకు చెందిన యువకులకు ఎస్‌ఐ సురేష్ అధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అన్‌లైన్ ట్రేడింగ్, బిట్ కాయిన్స్, షాపింగ్, కస్టమర్ బంర్, గూగుల్లో సెర్చ్ చేయవద్దన్నారు. సైబర్ నేరాలు జరిగినప్పుడు వెంటనే 1930 టోల్ ఫ్రి నంబర్‌కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో సుందర్ రాజు, మల్లేశం, అశోక్, హనీఫ్, సైబర్ వారియర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు వినతి


జీహెచ్‌ఎంసీ కమిషనర్ అమ్రపాలికి పూలమొక్కను బహూకరిస్తున్న కార్పొరేటర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): జీహెచ్‌ఎంసీ కమిషనర్ అమ్రపాలిని డివిజన్ కార్పొరేటర్ పుష్ప శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను బహూకరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. రాయసముద్ర చెరువు, శ్రీనివాస్‌నగర్ కాలనీలోని ఫంక్షన్‌హాల్, కాకతీయనగర్‌లోని స్పోర్ట్ కాంప్లెక్స్, పాత రామచంద్రాపురంలోని మీట్ మార్కెట్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరగా ఆమె సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం


సన్మానం పొందిన ఉపాధ్యాయులు

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని ఎద్దు మైలారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీ అయిన ఉపాధ్యాయులను శనివారం సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు


రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

పటాన్‌చెరు: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ లాలునాయక్ అన్నారు. మండల పరిధిలోని ముత్తంగి గ్రామంలో హరి దోష హోటల్ సమీపంలో జాతీయ రహదారిపై గుంతలు పూడ్చి వేయించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వాహనాదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రాంగ్ రూట్‌లో వాహనాలు నడుపొద్దని సూచించారు. ఆయన వెంట ట్రాఫిక్ పోలీసులు, సిబ్బంది ఉన్నారు.

పశువులకు మేత ఏదీ?

- గ్రాసం లేక అలమటిస్తున్న మూగజీవాలు
- అందరి దృష్టి పత్తి పంట సాగుపైనే
- 30వేల ఎకరాలలో జొన్న పంట
- గతంలో కంటే 58.605 ఎకరాలలో పత్తి సాగు

మునిపల్లి(అందోల్): రైతులు తమ లాభ సాటి కోసం పత్తి పంట సాగు చేస్తుండటంతో పశువులకు మేత కరువవుతోంది. గతంలో పశువుల మేత కోసం రైతులు ఎక్కువగా జొన్న పంట, చెరకు పంట సాగు చేసేవారు. అంతేకాకుండా చెరకు పంటతో కూడా పశువులకు మేత దొరికేది. ఎకరాలకు ఎకరాలు బీడు భూములుండేవి. భూములకు ధరలు రోజు రోజుకు పెరుగుతుండటంతో వ్యవసాయం చేయని రైతులు భూములను అమ్ముకుంటున్నారు. వర్షం పడకపోయినా తట్టుకొని నిలబడుతుందనే నమ్మకంతో పత్తి పంట సాగుపైనే రైతులు దృష్టి సారిస్తున్నారు. వ్యవసాయ గతేడాది పచ్చ జొన్న, నీళ్ల జొన్న పంట 30వేల ఎకరాలలో సాగు చేసినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో ఎక్కువశాతం మంది రైతులు పత్తి పంట సాగుపైనే దృష్టి సారించారు.


మునిపల్లి శివారులో సాగు చేసిన జొన్న పంట


పిల్లోడి గ్రామంలో సాగుచేసిన పత్తి పంట

అధికారుల లెక్కల ప్రకారం...

గత సంవత్సరం 3.30.670 ఎకరాలలో పత్తి పంట సాగు చేయగా ప్రస్తుతం 3.89.275 ఎకరాలలో సాగు చేస్తున్నట్లు అధికారుల లెక్కలు చేబుతున్నాయి. గతేడాది కంటే ఈ ఏడాది 58.605 ఎకరాలలో అదనంగా రైతులు పత్తిని సాగు చేస్తున్నారు. పత్తి పంటకు సరైన గిట్టుబాటు ధర లేకపోయినా రైతులు పత్తి పంటనే ఎక్కువగా సాగు చేస్తుండటం గమనార్హం.

అవగాహన కల్పించాలి


జొన్న పంట వేయాలని రైతులకు అవగాహన కల్పించాలి. పశువులకు మేత కోసం ఉచితంగా విత్తనాలు సరఫరా చేయాలి. జొన్న పంట, పప్పుధాన్యాల పంటలు సాగు చేయాలని రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలి.

– శంకరయ్య, రైతు, పిల్లోడి గ్రామం

రైతులు పట్టించుకోవడం లేదు


పత్తి పంట సాగు చేయడంతో పశువులకు మేత కొరత ఏర్పడుతోంది. మారుతున్న కాలానుగుణంగా ఎక్కువగా రైతులు పత్తి, సోయ వంటి పంటలను సాగు చేస్తుండటంతో ఆహార పంటల సంఖ్య తగ్గిపోయింది. జిల్లా వ్యాప్తంగా పత్తి పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. దీంతో పశువులు మేత మేయడానికి కూడా గడ్డిలేకుండా దుక్కులు దున్నుతున్నారు. జొన్న పంట వేయాలని రైతులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదు.

– అంబికాసోని, జిల్లా వ్యవసాయాధికారి


రామచంద్రాపురం: బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బెల్ అధికారులు

ఆదర్శప్రాయుడు బాబు జగ్జీవన్‌రామ్


పటాన్‌చెరు టౌన్: జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్, నాయకులు


జహీరాబాద్ టౌన్: బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

భెల్ ఈడీ కేజీ రాజా

రామచంద్రాపురం(పటాన్‌చెరు) ఆదర్శప్రాయుడు బాబు జగ్జీవన్‌రామ్ అని భెల్ ఈడీ కేబీ రాజా, ఈడీ పీఈ అండ్ ఎస్‌డీ శ్రీనివాస్‌రావు అన్నారు. డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని బెల్ టౌన్‌షిప్ యాజమాన్యం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బెల్ టౌన్‌షిప్ వాసులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో...

పటాన్‌చెరు టౌన్: బాబు జగ్జీవన్ రామ్ అందరికీ ఆదర్శప్రాయుడని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి పటాన్‌చెరు పట్టణంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు అఫ్జల్, నాయకులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్‌కు నివాళి

జహీరాబాద్ టౌన్: బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి పురస్కరించుకొని పట్టణ పరిధిలోని పస్తాపూర్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి శనివారం స్థానిక కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాములు, నాయకులు గుండారెడ్డి, మల్లారెడ్డి, అక్బర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


వట్‌పల్లి: బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

యువజన సంఘాల ఆధ్వర్యంలో...

వట్‌పల్లి(అందోల్): మండల కేంద్రంలో బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని యువజన సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. జగ్జీవన్‌రామ్ సామాజిక సమానత్వం కోసం జీవిత కాలం పోరాడారని కొనియాడారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బాలరాజ్, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు శివయ్య, ఉపాధ్యక్షుడు నర్సింహులు, ప్రకాశం, సాయిలు, దాసు, కేవీపీఎస్ మండల అధ్యక్షుడు జనార్ధన్, వీరన్న, సుకుమార్, శీను, నాగేష్, బాబు, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

మనీ లాండరింగ్ కేసులో ఉన్నావంటూ..

- పటాన్‌చెరులో సైబర్ మోసం
- రూ.3లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్ చెరు టౌన్: మనీ లాండరింగ్ కేసు నమోదైందని చెప్పి సైబర్ మోసానికి పాల్పడిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం లక్డారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి జూలై 1వ తేదీన మనీలాండరింగ్ కేసులో ఉన్నావని, మీ ఆధార్ ఫోన్ నంబర్ ఉన్నాయని ముంబై చెంబూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసు పెండింగ్ ఉందని చెబుతూ అపరిచిత వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. భయపడిన బాధితుడు సదరు వ్యక్తి చెప్పిన విధంగా చేయడంతో ఖాతా నుంచి రూ.3 లక్షలు డ్రా అయినట్టు మెసేజ్ వచ్చింది. వెంటనే బాధితుడు ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం శనివారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ


విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

సంగారెడ్డి : పట్టణంలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సెయింట్ పీటర్స్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఆరవ తరగతి విద్యార్థిని వి.రుత్విక పరుగు పందెంలో మొదటి స్థానంలో, ఏడవ తరగతి విద్యార్థి వివేకానంద లాంగ్ జంప్‌లో రెండో స్థానంలో నిలిచారు. విద్యార్థులిద్దరూ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ విద్యార్థుల ప్రతిభ విద్యార్థులందరికీ ఎంతో స్ఫూర్తినిస్తుందని సెయింట్ పీటర్స్ పాఠశాల చైర్మన్ ఆంథోని రెడ్డి, కరస్పాండెంట్ రవి కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ మహేందర్ అన్నారు.

విరబూసిన బ్రహ్మకమలం

పూజలు చేసిన కాలనీవాసులు

సంగారెడ్డి టౌన్: పట్టణంలోని చాణక్యపురి కాలనీకి చెందిన దండు ప్రభుఅనిత ఇంటి ఆవరణలో శుక్రవారం అరుదైన బ్రహ్మ కమలం విరబూసింది. హిమాలయాల్లో మాత్రమే వికసించే ఈ బ్రహ్మకమలం తమ ఇంటి ఆవరణలో విరబూయడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బ్రహ్మకమలానికి ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మకమలాన్ని తిలకించేందుకు స్థానిక ప్రజలు ప్రభుఅనిత ఇంటికి వెళ్లి హారతులతో పూజలు చేసి భక్తి భావాన్ని చాటుకున్నారు.



పెంపుడు జంతువులకు టీకాలు తప్పనిసరి


పెంపుడు కుక్కకు టీకా వేస్తున్న వైద్యుడు


పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు టీకాలు వేస్తున్న డాక్టర్లు


పెంపుడు కుక్కకు టీకా వేస్తున్న డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి

జహీరాబాద్: జూనోసిస్ డేను పురస్కరించుకుని పెంపుడు కుక్కలకు పట్టణంలోని పశువైద్యశాలలో శనివారం రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ జహీరాబాద్ పశు వైద్య శాలకు ప్రత్యేకంగా 100 వ్యాక్సిన్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఇప్పటివరకు 40 కుక్కలకు, రెండు పిల్లులకు వ్యాక్సిన్లు వేసినట్లు తెలిపారు. ఝరాసంగం వైద్యశాలలో 20కుక్కలకు, న్యాల్‌కల్ పశు వైద్యశాలలో 5 కుక్కలకు వ్యాక్సిన్ వేసినట్లు వివరించారు.

రాయికోడ్(అందోల్): పెంపుడు జంతువులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశు వైద్యాధికారి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పశువైద్యశాలలో శనివారం వరల్డ్ జూనోసిస్ డే సందర్భంగా పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూగజీవాల పెంపకంలో పోషకులు అవగాహనతో పాటు అప్రమత్తతను కలిగి ఉండాలని సూచించారు. పెంపుడు కుక్కల నుంచి రేబిస్, గజ్జి తదితర వ్యాధులు మనుషులకు వ్యాపిస్తాయన్నారు. దీంతో పెంపుడు కుక్కలకు టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది, పోషకులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

పటాన్‌చెరు టౌన్: జూనోసిస్ డే పురస్కరించుకొని పటాన్‌చెరు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు రేబీస్ వ్యాధి సోకకుండా ఉచితంగా టీకాలు వేశారు. ఈ సందర్భంగా ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు మునీర్ అహమద్ అన్సారి మాట్లాడుతూ.. జూనోసిస్ అనగా జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధి అని తెలిపారు. పెంపుడు కుక్కల యాజమానులు తమ కుక్కలకు తప్పనిసరిగా టీకాలను వేయించాలని సూచించారు. 96 పెంపుడు కుక్కలకు ఉచితంగా టీకాలు వేసినట్లు తెలిపారు.

మిషన్ భగీరథ నీరు వృథా

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండల పరిధిలోని అన్నారం గ్రామంలో శనివారం మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలింది. దీంతో లక్షల లీటర్ల తాగు నీరు వృథాగా పోయింది. అధికారులు తక్షణమే స్పందించకపోవటంతో 5గంటల పాటు నీరు వృథాగా వెళ్లాయి. స్థానికుల ఫిర్యాదు మేరకు మిషన్ భగీరథ అధికారులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టారు.


వృథాగా వెళుతున్న తాగునీరు

సంక్షిప్త వార్తలు

◆ జీవో 10 రద్దు చేయండి

సంగారెడ్డి టౌన్: అంగన్‌వాడీల జీవో నెంబర్ 10 రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ ఉద్యోగులు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

ఖేడ్ డివిజన్ పరిధిలో...

నారాయణఖేడ్: అంగన్‌వాడీలకు నష్టం కలిగించే జీవో 10ను రద్దు చేయాలని సీఐటీయూ ఖేడ్ ప్రాంత బాధ్యులు నల్లవల్లి రమేష్ డిమాండ్ చేశారు. డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవీ విరమణ ప్రయోజనాల కింద అంగన్వాడీ టీచర్లకు రూ.2లక్షలు, సహాయకులకు రూ.లక్ష చొప్పున అందజేయాలన్నారు. కనీస వేతంగా రూ.26 వేలు అందించాలని డిమాండ్ చేశారు.

◆ మండల ప్రత్యేక అధికారిగా రామాచారి

మునిపల్లి(అందోల్): మండల ప్రత్యేకాధికారిగా రామాచారి శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో గ్రామ ప్రత్యేకాధికారులతో పాటు మండల ప్రత్యేకాధికారులను ప్రభుత్వం నియమించింది.

◆ బోరుమోటారు ఏర్పాటు

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మంత్రి ఆదేశాల మేరకు జెడ్పీ నిధులతో బోరుమోటరును ఏర్పాటు చేసేందుకు శనివారం జెడ్పీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు మల్లికార్జున్‌పాటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి దామోదర రాజనర్సింహా సహకారంతో మండల అభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కేధారి నాథ్ పాటిల్, ఎంపీడీఓ ఎంఎం.షరీఫ్, హెచ్‌ఎం అంజయ్య, యువ నాయకులు మధుకర్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఉపాధ్యాయుడికి సన్మానం

మునిపల్లి(అందోల్): పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు చంద్రయ్య దంపతులను గోపులారం మాజీ ఎంపీటీసీ పాండు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గొర్రెగట్టు గ్రామానికి చెందిన చంద్రయ్య ఆయా గ్రామాల్లోని పాఠశాలలో ఉపాధ్యాయుడికి సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

◆ శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళి



జహీరాబాద్ టౌన్: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని బీజేపీ నియోజకవర్గం ఇన్‌చార్జి నౌబాద్ జగన్నాథ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సుధీర్ బండారీ, అనిత పాటిల్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌గుప్తా, విశ్వనాథ్‌యాదవ్, జనార్ధన్‌రెడ్డి, విశ్వనాథ్‌స్వామి, నరేష్‌పాటిల్, సోమ అనిల్, ప్రభాకర్‌రెడ్డి, పాలికంర్ సంతోష్, రాఘవేంద్రనాయక్, శ్రావణ్ పాల్గొన్నారు.

◆ ఐకేపీ భవనం పరిశీలన

జిన్నారం(పటాన్‌చెరు): మండల కేంద్రానికి కోర్టు మంజూరు కావటంతో శనివారం జిల్లా కోర్టు జడ్జి భవానీచంద్ర ఏకేపీ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా భవనంలో అవసరమయ్యే గదులు, కోర్టు ఏర్పాటుకు ఉపయోగపడే వసతులు తదితర విషయాలను అధికారులకు అడిగి తెలుసుకున్నారు. కోర్టు ఏర్పాటుకు ఈ భవనం అనుకూలంగా ఉందని, త్వరలోనే కోర్టును ఏర్పాటు చేయించేలా చర్యలు తీసుకుంటామని జడ్జి తెలిపినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో జిన్నారం తహసీల్దార్ భిక్షపతి, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

◆ ఆటోలకు స్టిక్కరింగ్

సంగారెడ్డి: ఎస్పీ రూపేష్ ఆదేశాల మేరకు పట్టణ పోలీస్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలో శనివారం ఆటోలకు మై ఆటో ఈజ్ సేఫ్ స్టిక్కర్స్‌ను అతికించారు. కార్యక్రమంలో టౌన్ ఎస్‌ఐ క్రాంతికుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

◆ ఘనంగా అంతర్జాతీయ సహకార దినోత్సవం

రామచంద్రాపురం(పటాన్‌చెరు) తెల్లాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో డైరెక్టర్‌లు సునీల్, నాగిరెడ్డి, అనంతయ్య, యాదయ్య పాల్గొన్నారు.

◆ యువకుడు అదృశ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): యువకుడు అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శేరిలింగంపల్లి విద్యానగర్‌కాలనీలో నివాసం ఉండే విశాల్ అన్‌లైన్ బెట్టింగ్ ఆడి డబ్బులు పోగొట్టుకున్నాడు. గత నెల 30వతేదీన అతని తల్లితో కలసి రామచంద్రాపురం పట్టణంలోని లింగంపల్లి చౌరస్తా వద్దకు వచ్చాడు. అక్కడ తల్లికి చెప్పకుండా విశాల్ వెళ్లిపోయాడు. దీంతో అతని ఆచూకీ కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

◆ విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



వట్‌పల్లి(అందోల్): శ్రీకాశీ అన్నపూర్ణేశ్వరి సేవా సమితి హైదరాబాద్ వారి అధ్వర్యంలో మండల పరిధిలోని ఖాదిరాబాద్ జెడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలకు చెందిన 250 మందికి స్కూల్ బ్యాగ్స్, తదితర విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కరరెడ్డి, జెడ్పీహెచ్‌ఎస్ కర్చల్ హెచ్‌ఎం నర్సింలు, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.